జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 15 | మార్చి | 2026 ◆ పేజీలు : 5

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 14, ప్రజా జ్యోతి:** జిల్లాలో నిర్వహిస్తున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం పాల్వంచ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , జిల్లా పరిషత్ ఉన్నత బాలికల అభ్యుదయ పాఠశాల పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా

మిగతా 2 లో...

# భూమి వివాదం... ముదురింది

- సెల్ఫీ వీడియోలో రక్షణ కోరిన బాధిత మహిళ
- తాతముత్తాతల కాలం నాటి సాగు భూమి కాపాడాలంటూ వేడుకుంటున్న బాధిత మహిళ
- కార్పొరేటర్ భర్తతో పాటు మరి కొందరిపై వేధింపుల ఆరోపణలు
- 1/70 యాక్ట్ లో దళితులకు భూమిపై హక్కు ఎక్కడదంటూ బెదిరింపులు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కూనంనేని స్పందించాలని విజ్ఞప్తి
- చిట్టీ రామవరం ప్రజలు అండగా నిలవాలని కోరిన బాధిత మహిళ
- సెల్ఫీ వీడియోద్వారా రక్షణ కోరిన బాధిత మహిళ



**కొత్తగూడెం, మార్చి 14 ( ప్రజాజ్యోతి )** బాధిత మహిళ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూమి వివాదం చర్చనీయాంశంగా మారింది. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన కుటుంబాన్ని కొందరు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ విడుదల చేసిన సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిట్టీ రామవరం నివాసి వసుందర అనే బాధిత మహిళా తన కుటుంబానికి చెందిన భూమిపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ఈ వీడియో విడుదల చేసింది. తమ తాతముత్తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించింది. స్వాతంత్ర్యం రాక ముందు నుంచే తమ కుటుంబం సాగు చేసుకుంటున్న ఈ భూమిని ఇప్పుడు 1/70 యాక్ట్ పేరుతో తమకే చెందుతుందని చెబుతూ

మిగతా 2 లో...

## శ్రీరామనవమి ఏర్పాట్లకు సి ఎస్ ఆర్ సంస్థల సహకారం అవసరం

### జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్: మార్చి14 :ప్రజా జ్యోతి** భద్రాచలంలో ఈ నెల 27న నిర్వహించనున్న శ్రీరామ నవమి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్ ) సంస్థల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం ఐ డి ఓ సి కార్యాలయంలో వివిధ సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీసీ, నావా లిమిటెడ్, కేటీపీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సింగరేణి, టీజీ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు గతంలో అందించిన సహకారం, ఈ సంవత్సరం అందించనున్న సహాయంపై వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలంలో జరిగే శ్రీరామ నవమి వేడుకలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. భక్తులకు తాగునీరు, అన్నదానం, వసతి, పారిశుధ్యం వంటి అవసరమైన సౌకర్యాలు

మిగతా 2 లో...

## చిన్న ఆసుపత్రి... పెద్ద శస్త్రచికిత్స

- ప్రజలకు దగ్గరగా అత్యాధునిక వైద్యం
- పాల్వంచ సిహెచ్ సి లో ఖరీదైన మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం
- పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి శ్రీరామరక్షగా మారిందని హర్షం వ్యక్తం చేసిన రోగి కుటుంబ సభ్యులు



**కొత్తగూడెం కలెక్టరేట్: మార్చి14: ప్రజా జ్యోతి:** పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మరోసారి మోకాలి మార్పిడి (ఎడమ మోకాలి కీళ్ల మార్పిడి ) శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలు – –వరంగల్ పట్టణానికి

మిగతా 2 లో...

## జనం మన్ననలు పొంద గలిగిన వారే నిజమైన నాయకులు

- కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకం కావాలి
- సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలి
- ఎంఎల్ఎ కూనంనేని



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి14 ,ప్రజా జ్యోతి:** జనం మన్ననలు పొందగలిగిన వారే నిజమైన నాయకులు అని, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు అనునిత్యం ప్రజలతో మమేకం కావాలిని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ ఆధ్వర్యంలో గెలుపొందిన ప్రజాప్రతినిధులకు పాల్వంచలోని సుగుణ గార్డెన్స్లో జరుగుతున్న రెండో రోజు శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టు నాయకులకు పదవుల కంటే ప్రజలే ముఖ్యమని, ఆ పదవులే కావాలనుకుంటే జ్యోతిబసు లాంటి కమ్యూనిస్టు యోధులు ఏ నాడో ప్రధాని అయ్యేవారని తెలిపారు. చంద్రా రాజేశ్వరరావు లాంటి నేత పార్టీ

మిగతా 2 లో...

## శ్రీరామనవమి ఏర్పాట్లకు సి ఎస్ ఆర్ సంస్థల సహకారం అవసరం

(మొదటి పేజీ తరువాయి...)

మెరుగ్గా కల్పించేందుకు సి ఎస్ ఆర్ సంస్థలు తమవంతు సహకారం అందించాలని కోరారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈఓతో సంప్రదించి అవసరమైన ఏర్పాట్ల వివరాలను సేకరించాలని ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) సంజీవరావును ఆదేశించారు. ఆ అవసరాల మేరకు సి ఎస్ ఆర్ సంస్థల సహకారాన్ని సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

(మొదటి పేజీ తరువాయి...)

తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించబడుతున్నాయా అనే అంశాలను పరిశీలించి, పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, ఫర్నిచర్ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలలో విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత బాలికల అభ్యుదయ పాఠశాలలో మొత్తం 210 మంది విద్యార్థులకు గాను 209 మంది హాజరు కాగా, ఒకరు గైహాజరయ్యారనీ, అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 135 మంది విద్యార్థులకు గాను 131 మంది హాజరుకాగా, నలుగురు గైహాజరయ్యారనీ, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,740 మంది విద్యార్థులు నమోదు కాగా, వారిలో 12,701 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 39 మంది విద్యార్థులు గైహాజరయ్యారనీ, రెగ్యులర్ విద్యార్థుల్లో 12,720 మందికి గాను 12,687 మంది హాజరుకాగా, 33 మంది గైహాజరయ్యా రన్నారు, అదేవిధంగా ప్రైవేట్ అభ్యర్థుల్లో 20 మందికి గాను 14 మంది హాజరుకాగా, 6 మంది గైహాజరయ్యారనీ, జిల్లాలో మొత్తం హాజరు శాతం 99.74 శాతంగా నమోదైంది. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 (బి) అమలులో ఉందని, అనుమతి లేని వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ పరీక్షలు సజావుగా నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీలు కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళకు కుట్టుమిషన్, నగదు సహాయం.



**పాల్వంచ, మార్చి 14, ప్రజాజ్యోతి:** తల్లాడకు చెందిన నిరుపేద మహిళ మీనాకు కుట్టుమిషన్, నగదు సహాయం అందించారు. మీనా భర్త వికలాంగుడు కాగా, కొడుకు ప్రమాదానికి గురై మెదడులో రక్త గడ్డ కట్టడంతో తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్నాడు. ఇంటి పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉండటంతో జీవనం సాగించడం కూడా కష్టంగా మారింది. ఆమె బయటకు పనికి వెళ్లితే కొడుకును చూసుకునే వారు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో సహాయం కోరగా పాల్వంచ వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్, రాజ్యలక్ష్మి దంపతులు, మండల ఆర్యవైశ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆరెంజ్ మెడికల్ అధినేత గూడెపు శ్రీనివాస్, స్వాతి దంపతులు స్పందించారు. వారు కొత్త కుట్టుమిషన్ అందించి, రూ.2,000 నగదు సహాయం చేశారు. జాకెట్లు కుట్టడం వచ్చునని తెలిసి ఆ పనితో జీవనం కొనసాగించడంతో పాటు కొడుకుకు మందుల ఖర్చులకు కొంత ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా చలవాది ప్రకాష్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని పేర్కొన్నారు. సాటివారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి ధర్మమని తెలిపారు. తన వద్దకు సహాయం కోసం వచ్చే వారికి వీలైనంత త్వరగా తక్షణ సహాయం అందించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. తన మిత్రబృందంతో కలిసి ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని వెల్లడించారు.

# భూమి వివాదం ముదురింది

(మొదటి పేజీ తరువాయి...)

కొందరు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపింది. ఈ వ్యవహారంలో 19వ డివిజన్ కార్పొరేటర్ స్వప్న, ఆమె భర్త డాక్టర్ శంకర్ నాయక్, గోబ్రానాయక్, కల్లూరు కుమార్, బోడా కృష్ణలు తమ కుటుంబాన్ని బెదిరిస్తున్నారని వసుందర ఆరోపించింది. వీరి వలన తనకు తన కుటుంబానికి ప్రాణహాని ఉందని వీడియోలో పేర్కొంది. తమ భూమిని ఆక్రమించేందుకు కుట్రలు జరుగుతున్నాయని తన భర్త లాయర్ రమేష్‌ను మద్యం తాగించి తమకు వ్యతిరేకంగా ఉపయోగిస్తున్నారని కూడా ఆమె ఆరోపించింది. తమ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేస్తూ భూమిని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని బాధిత వసుందర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితుల్లో తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ చిట్టీ రామవరం ప్రజలు తమకు అండగా నిలవాలని కోరింది. అలాగే తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి



భట్టి విక్రమార్క, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు స్పందించి తన కుటుంబానికి రక్షణ కల్పించాలని వీడియోలో విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికంగా ఈ భూమి వివాదం చర్చనీయాంశంగా మారింది.

**♦ మాపై వస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధం : డాక్టర్ శంకర్ నాయక్**

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న బాధిత మహిళ ఆరోపణల మేరకు డాక్టర్ శంకర్ నాయక్ ను ప్రజాజ్యోతి ప్రతినిధి వివరణ కోరగా అయన స్పందించారు. చిట్టీ రామవరం ప్రాంతంలో భూమి వివాదం నేపథ్యంలో తమపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని ఆయన స్పష్టం చేశారు. లాయర్ రమేష్‌ను కిడ్నాప్ చేసి భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్న ఆరోపణలు పచ్చి అబద్ధమని ఆయన పేర్కొన్నారు. వసుందర అనే మహిళ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ఈ విషయంలో తాము ఇప్పటికే స్థానిక రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామని తెలిపారు. ఫిర్యాదు చేసే సమయంలో వసుంధర భర్త లాయర్ రమేష్ కూడా అందుబాటులో ఉన్నాడని తనని ఎవరు ఇబ్బందులకు గురి చేయలేదని స్వయంగా తానే పోలీసు వారికి వెల్లడించినట్లు తెలిపారు. పూర్తిగా నిజనిజాలు తెలుసుకోకుండా 19 వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలుపొందిన తన భార్యపై మరియు తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైంది కాదని ఇలాంటి ఆరోపణలను తాము సహించబోమని డాక్టర్ శంకర్ నాయక్ స్పష్టం చేశారు. అవసరమైతే తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దాఖలు చేస్తామని తెలిపారు.

## జనం మన్ననలు పొందగలిగిన వారే నిజమైన నాయకులు

(మొదటి పేజీ తరువాయి...)

నిర్మాణానికి, ప్రజాపోరాటలకే ప్రాధాన్యత ఇస్తూ ఎమ్మెల్సీ తృణప్రాయంగా భావించి రాజీనామా చేశారని అన్నారు, కమ్యూనిస్టు నేతలెవ్వరూ ఆడంబరాలకు పోకుండా సామాన్య ప్రజా జీవితాన్ని గడిపారని, పుచ్చలపల్లి సందరయ్య వంటి నాయకులు సైకిల్ పై పార్లమెంట్కు వెళ్లారని,ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మడి నర్సయ్య సాదా సీదా జీవనాన్ని సాగిస్తున్నారని, రజబ్ అలీ వంటి మేధావులు కమ్యూనిజమే ఊపిరిగా జీవనం సాగించారన్నారు, వీరంతా ప్రజాసేవలో ఆదర్శమూర్తులని చెప్పారు. వీళ్లందరితో పోల్చుకుంటే మనం చాలా తక్కువని, స్వార్ధ ప్రయోజాలకు తావులేని ప్రజాసేవకు అంకితం కావాలన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రజా సేవ చేసేందుకు ముందుకు రావడం గొప్ప విషయమని, నిబద్ధతతో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలన్నారు. కమ్యూనిస్టు నాయకునిగా ఉంటే ఆ విలువే వేరని, అన్యాయం రాజ్యమేలుతున్నప్పుడు ప్రజల కమ్యూనిస్టులను కోరుకుంటారని కమ్యూనిస్టుల దగ్గరకు వెళితే సమస్యలు తీరుతాయనే నమ్మకం ప్రజల్లో ఉందని, దానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రతీ రోజు ప్రజాప్రతినిధులు వారివారి వార్డుల్లో, డివిజన్లలో తిరగాలాని, ఆత్మీయానుబంధాలు పెంచుకోవాలని, సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కొందరు కమ్యూనిస్టులపై అవాకులు చెవాకులు పేలుతున్నారని, సీట్ల సర్దుబాటు సమస్య కారణంగా విడివిడిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాల్సి వచ్చిందని, ఆ సమయంలో కూడా మనస్సుకు గాయం అయ్యేలా కొందరు ఇష్టాను సారంగా మాట్లాడారని, ఆ కసితో గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పనిచేశామని, వారి కంటే మూడు వేల ఓట్లు అత్యధికంగా నియోజకవర్గంలోని గ్రామపంచాయితీల్లో పోలయ్యాయని చెప్పారు. కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం ఇదే తతంగం సాగిందని, దీనిని కూడా సవాల్ గా తీసుకుని కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో విజయ ఢంకా మోగించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నామని తెలిపారు. అహంభావం పతనానిక దారి తీస్తుందని , ప్రజల కోసం నిస్వార్థ జీవితం గడిపిన వారు చరిత్రలో నిలిచిపోతారని, తాత్విక ఆలోచనలతో ముందుకు సాగాలని కూనంనేని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ సుజన్ అ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి ఛైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, బేజవాడ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు, కర్రి బిక్షపతి, అజయ్ సారధి, మేయర్ మూడ్ గణేష్లు పాల్గొనగా మునిగడప పద్మ, ఉమా వాసిరెడ్డి మురళీ స్టీరింగ్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

## చిన్న ఆసుపత్రి... పెద్ద శస్త్రచికిత్స



(మొదటి పేజీ తరువాయి...)

చెందిన ఐ. కవిత (52) గత మూడు సంవత్సరాలుగా ఎడమ మోకాలి తీవ్రమైన నొప్పితో బాధపడుతూ కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిని సంప్రదించగా, శస్త్రచికిత్సకు సుమారు రూ.1.5 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థికంగా భరించే స్థోమత లేక చికిత్సపై ఆందోళన చెందిన ఆమెకు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంతకుముందు విజయవంతంగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించిన విషయం తెలిసి, అక్కడి ఆర్థోపెడిక్ నిపుణుడు డా. శైలేష్‌కుమార్‌ను సంప్రదించారు. రోగి ఆర్థిక పరిస్థితి ని గమనించిన డా శైలేష్ వైద్య బృందం ప్రత్యేక చొరవతో శనివారం పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి ఆమెకు ఎడమ మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు, సాధారణంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చయ్యే ఈ శస్త్రచికిత్సను చిన్న ప్రభుత్వ ఆసుపత్రిలోనే నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ ఆపరేషన్ పాల్వంచ సిహెచ్ సి నిర్వహించిన రెండో మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స కావడం గమనార్హం. దీంతో రోగి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఈ ఆసుపత్రి శ్రీరామరక్షగా మారిందని వారు ఆనందం వ్యక్తం చేశారు, ఈ శస్త్రచికిత్స నిర్వహించిన బృందంలో ఆర్థోపెడిక్ వైద్యుడు డా. శైలేష్ కుమార్, అనస్థీషియా వైద్యుడు డా. రామ్ ప్రసాద్, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది రేవతి, స్వర్ణలత, ఉమ, సర్ఫరాజ్, నర్సింహ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు

- **జిల్లా కలెక్టర్ అంకిత్**

**కొత్తగూడెం కలెక్టరేట్: మార్చి14 ప్రజా జ్యోతి**

తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్యచరణ ప్రణాళిక 2025_26 సంవత్సరానికి జిల్లా షెడ్యూల్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చెందిన యువతీ, యువకులు ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక 2025- 26 సంవత్సరానికి గాను బ్యాంకు ద్వారా సబ్సిడీ రుణాల కొరకు ఈవీ 2 వీలర్, ఇవి త్రీ వీలర్, సోలార్ యూని వర్సిల్ పంప్ కంట్రోల్ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అంకిత్, తెలిపారు. జిల్లా మొత్తం 276 యూనిట్ల గాను రూ.265.28 లక్షల సబ్సిడీతో ప్రణాళికలు తయారు చేసి రూ 1 లక్ష వరకు గాను 90% సబ్సిడీ, రూ.2 లక్షల గాను 80% సబ్సిడీ, రూ. 2 లక్షల నుండి రూ.4 లక్షల వరకు 70% సబ్సిడీతో , రూ.4 లక్షలు ఆపైన ఎంచుకోదగిన పథకాలకు 60% సబ్సిడీతో బ్యాంకుల ద్వారా రుణాలను అందజేస్తారని తెలిపారు. స్వయం ఉపాధి పథకాలను ఎంచుకునే వారికి 21 నుండి 50 సంవత్సరాలు లోపు వయసు ఉండాలని , వ్యవసాయ అదారిత పథకాలను ఎంచుకునే వారికి 21 నుండి 60 సంవత్సరాలు వయసు ఉండాలని , కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.1,50,000 , పట్టణ ప్రాంతం వారికి రెండు రూ.2,00,000 మించకుండా ఉండాలన్నారు, కావున అర్హత ఆసక్తి గల అభ్యర్థులు టి జి ఓ బి ఎం ఎస్ ఆన్లైన్ పోర్టల్ tgobmms.cgg.gov.in ద్వారా ఆధార్ కార్డు, రేషన్ కార్డు ,పాస్ ఫోటో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రములు, శాశ్వత డ్రైవింగ్ లైసెన్సు ,సదరం సర్టిఫికేట్ అంగవైకల్యం కోటాలో అర్హత కొరకు పట్టాదార్ పాస్ పుస్తకం సౌరశక్తి సోలార్ పంప్ సెట్ కొరకు కనీసం 2 ఎకరాల భూమి కలిగి ఉండాలనీ , అదే విధంగా బోర్వెల్ నీటి సదుపాయము కలిగి ఉన్న విధంగా పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరించాల,నీ ఈవి టూ వీలర్ వాహనాల కోసం ఎస్సీ వ్యవస్థాపకులు గిగ్ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది అన్నారు, జొమాటో ,స్విగ్గి ,రాపిడో, ఊబర్ వంటి క్లెమ్ చేయడానికి సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు దగ్గర్లో ఉన్న మీసేవ కేంద్రం నందు దరఖాస్తు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ నమోదు ప్రక్రియ ఈనెల 17నుండి 24వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అట్టి నమోదు చేసిన ఆన్లైన్ అప్లికేషన్ ఫామ్ హార్డ్ కాపీలని రూం నెంబర్ S1, రెండవ అంతస్తు ఎస్సీ కార్పొరేషన్ ఆఫీస్, ఐ డి ఓ సి కార్యాలయం నందు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

## మావోయిస్టుల డంప్ స్వాధీనం



**చర్ల, మార్చ్ 14: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని సుక్మా ప్రాంతంలో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలలో భద్రతా దళాలు భారీ విజయాన్ని సాధించాయి. గోమ్‌గూడ గ్రామంలోని పోడియంపారా ప్రాంతంలో నక్సలైట్లు వస్తువులను దాచిపెట్టారని నిర్దిష్ట నిఘా సమాచారం అందడంతో 226 బెటాలియన్ సి ఆర్ పీ ఎఫ్ యొక్క సి కంపెనీ శనివారం ప్రత్యేక ఆకస్మిక ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌కు అసిస్టెంట్ కమాండెంట్ జి. నబీ నాయకత్వం వహించారు. కమాండెంట్ హెచ్.పి. సింగ్ , సెకండ్–ఇన్–కమాండ్ బీరేంద్ర కుమార్ మొత్తం కమాండ్ పర్యవేక్షణలో జరిగింది. ఎఫ్ ఓ బి గోమ్‌గూడకు పశ్చిమాన దాదాపు 1 కిలోమీటరు దూరంలో ఉన్న పోడియంపారా ప్రాంతంలో దళాలు తీవ్ర శోధన ఆపరేషన్ నిర్వహించాయి. ఈ ఆపరేషన్ సమయంలో సమీపంలో అనుమానిత నక్సలైట్ డంప్ సైట్ కనుగొన్నారు . ఆ ప్రాంతాన్ని వెంటనే చుట్టుముట్టారు కె 9,బి డి డి బృందాల సహాయంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సోదాల్లో, నక్సలైట్లు దాచిపెట్టిన అనేక వస్తువులు పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

**స్వాధీనం చేసుకున్న వస్తువులు:** బ్లాక్ టార్పాలిన్ ప్లాస్టిక్ – ఒకటి, (సుమారు త్రీ. మీటర్లు), అమ్మోనియం నైట్రేట్ – 18 కిలోలు , గొడుగు – ఒకటి , పాత స్టీల్ టిఫిన్ బాక్స్ – ఒకటి , కొత్త సీల్డ్ మిల్క్ డోలు – ఒకటి , చిన్న స్టీల్ టీ టంబ్లర్ – ఒకటి , రాగి నీటి బాటిల్ – ఒకటి , చిన్న ఇనుప జర్నా – ఒకటి , సీలింగ్ (నలుపు) – ఒకటి , పౌచ్ & బ్యాక్‌ప్యాక్ – రెండు , స్లీపింగ్ బ్యాగ్ – రెండు , కొత్త నమూనా సి ఆర్ పీ ఎఫ్ పోంచో రకం వస్త్రం – సుమారు. రెండు మీటర్లు , సివిల్ క్లాత్ – పదిహేను , గ్రీన్ పెయింట్ – మూడు , వాటర్ కూలింగ్ బ్యాగ్ – ఒకటి , వైద్య వస్తువులు – అనేక వస్తువులు, మెస్ వస్తువులు అనేక వస్తువులు , విద్యుత్ వస్తువులు: ఛార్జర్ – ఒకటి , డేటా కేబుల్ – ఒకటి , బ్యాటరీ 4.5 వాట్ , స్విచ్ – రెండు ,విద్యుత్ వైర్ – మూడు మీటర్లు,డ్రాయింగ్ మ్యాప్ చార్ట్ పేపర్ – ఒకటి , 50 లేయర్ బ్లూ డ్రమ్ – ఒక పీస్ , నక్సల్ మ్యాగజైన్ – ఒక పీస్ కత్తి – రెండు పీస్ లను స్వాధీనం చేసుకున్నారు.ఈ విజయవంతమైన ఆపరేషన్ ఈ ప్రాంతంలో నక్సలైట్ కార్యకలాపాలకు పెద్ద దెబ్బ తగిలింది. 226వ బెటాలియన్ సి ఆర్ పీ ఎఫ్ నక్సలిజానికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడుతూనే ఉంది అని ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను కాపాడటానికి నిరంతర కార్యకలాపాలను నిర్వహిస్తోంది అని ఈ విషయంలో, భద్రతా దళాలు నక్సలిజాన్ని నిర్మూలించడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాయని కమాండెంట్ పేర్కొన్నారు. సైనికుల అప్రమత్తత ధైర్యాన్ని ఆయన ప్రశంసించారు . భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యకలాపాలు కొనసాగుతాయని అన్నారు .

## ఏకలవ్య విద్యాలయాల ఔట్‌సోర్సింగ్ పోస్టుల తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల



**భద్రాచలం ,మార్చి 14,ప్రజాజ్యోతి :** ఖమ్మం రీజియన్ పరిధిలోని గిరిజన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి బోధనేతర సిబ్బంది (ఔట్‌సోర్సింగ్) ఖాళీల భర్తీ కోసం నవంబర్ 24 నుండి డిసెంబర్ 10, 2025 వరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించినట్లు ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.ఈ పోస్టులకు సంబంధించి తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేసినట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ వివరాలను మార్చి 16 నుండి మార్చి 18, 2026 వరకు ప్రాంతీయ సమన్వయ అధికారి, ఖమ్మం రీజియన్ కార్యాలయం (ఐటిడీఏ, భద్రాచలం) నోటీసు బోర్డులో పరిశీలించవచ్చన్నారు.అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆయా తేదీల్లో కార్యాలయ పనివేళల్లో ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పీవో రాహుల్ కోరారు.

## బీఆర్ఎస్ నేత కుటుంబానికి మాజీ జడ్పీటీసీ పరామర్శ



**బూర్గంపహాడ్, మార్చి 14 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలం సారపాకకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కోమటిరెడ్డి రాజశేఖర్రెడ్డి తండ్రి మోహనరెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు.శనివారం ఆయన సంస్మరణ సభకు మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత రామకొండారెడ్డి దంపతులు హాజరై మోహన్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. సంస్మరణ సభలో పాల్గొని రాజశేఖరరెడ్డికి ధైర్యం చెప్పారు.సంస్మరణ సభకు హాజరైన వారిలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, తాళ్లగొమ్మూరు సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణి, పట్టణ అధ్యక్షులు కొనకంచి శ్రీను, బెజ్జంకి కనకాచారి, యూత్ నాయకులు చల్లకోటి పూర్ణ, సోము లక్ష్మి చైతన్యరెడ్డి, పంగి సురేష్, చట్టు ఆంజనేయులు, దాసరి మోహన్, సానికొమ్ము రామచంద్రారెడ్డి, యారం వెంకటరెడ్డి,కర్రి రాజేంద్రప్రసాద్, ముచ్చా వెంకటేశ్వర్లు ఉన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

- **మండలంలో రెండు పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ**



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 14, ప్రజాజ్యోతి:** అ న్నపురెడ్డిప ల్లి మండల కేంద్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి రోజు తెలుగు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకుని తమ తమ గదుల్లోకి వెళ్లారు. మండలంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులను అరగంట ముందుగానే లోపలికి అనుమతించారు.పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని మౌలిక వసతులు కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, కూర్చోవడానికి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 250 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, ఒకరు గైర్హాజరై 249 మంది విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారని మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ కుమార్ తెలిపారు. పదో తరగతి పరీక్షలు మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నట్లు ఆయన వెల్లడించారు.

## ఏకాదశి సందర్భంగా గోదావరి నదీహారతి సాంస్కృతిక కార్యక్రమాలు





**భద్రాచలం ,మార్చి 14,ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో దివ్యక్షేత్రం భద్రాచలంలో ప్రవహిస్తున్న పుణ్య గోదావరి నదికి ఏకాదశి సందర్భంగా ఆదివారం (మార్చి 15) గోదావరి స్నాన ఘట్టాల వద్ద గోదావరి నదీహారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తెలిపారు.ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన శ్రీ వాగ్దేవి కళా సమితి అధ్యక్షులు నెల్లుట్ల శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో నాదోపాసన సంగీత కచేరి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 5.30 గంటలకు డా. సింధూజ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, రాత్రి 7 గంటలకు ప్రియా సిస్టర్స్ – విద్వాన్ శ్రీమతి షణ్ముఖప్రియ, విద్వాన్ శ్రీమతి హనిప్రియల కర్ణాటక సంగీత కచేరి నిర్వహించనున్నట్లు తెలిపారు.ఐటీసీ సారపాక, కళ్యాణి గ్రూప్ (భారత్ ఫోర్జ్ లిమిటెడ్), పుణే సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులు పొందాలని సబ్ కలెక్టర్ కోరారు.

## పశువులకు గాలి కుంటు టీకాలు తప్పనిసరి: డా. ఉజ్వల



**పిన పాక , మార్చి 14 ( ప్రజాజ్యోతి):** పశువులను గాలి కుంటు (ఎఫ్ఎండీ) వ్యాధి నుంచి రక్షించేందుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని వెటర్నరీ వైద్యురాలు డాక్టర్ ఉజ్వల తెలిపారు. శనివారం పినపాక మండలం ఈ బ య్యారం గ్రామంలో నిర్వహిస్తున్న గాలి కుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి పశువుల ఆరోగ్య పరిరక్షణలో టీకా ల ప్రాముఖ్యతను వివరించారు. గాలి కుంటు వ్యాధి వ్యాప్తి చెందితే పశువులకు తీవ్ర నష్టం కలుగుతుందని, పాల ఉత్పత్తి కూడా తగ్గిపోతుందని చెప్పారు. అం దువల్ల ప్రతి రైతు తమ పశువులకు సమయానికి టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**చర్ల, మార్చ్ 14: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు.ఈ సందర్భగా చర్ల మండలంలోని 45 కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదగా సంబంధితలకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని పేదలకు అండగా ఉంటుందని అర్హులైన అందరికీ పథకాలు అందేలా చూస్తుందని మండలంలో ప్రతి ఎకరాకు నీరు అందించే లాగా కృషి చేస్తానని పంచాయతీ సర్పంచ్ లు గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలాగా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు షురూ 124 మంది హాజరు



**ఆళ్ళపల్లి,మార్చి14ప్రజాజ్యోతి** ఆళ్ళపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శనివారం పదో తరగతి వార్షిక పరీక్షలు అత్యంత ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన పరీక్షకు ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు చెందిన మొత్తం 124మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లను డిపార్ట్మెంట్ ఆఫీసర్ (డిఈఓ) కృష్ణప్రసాద్, చీఫ్ సూపరింటెండెంట్ రమేష్‌లు స్వయంగా పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీస్ శాఖ (ఎస్ఐ)సోమేశ్వర్ ఆధ్వర్యం లో 144 సెక్షన్ అమలు చేస్తూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటి రోజు పరీక్ష విజయవంతంగా ముగిసింది.

## ఎయిర్ టెల్ 5జి ఫైబర్ నెట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఇల్లందు, మార్చి 14, ప్రజాజ్యోతి:** నూతనంగా ఇల్లందులోని జగదాంబ సెంటర్ లో ఎయిర్ టెల్ 5జీ ఫైబర్ నెట్ సేవలను శనివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లందులో ఎయిర్ టెల్ 5జి ఫైబర్ నెట్ సేవలను ప్రారంభించడం సంతోషకరమన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఇంటర్నెట్ సేవలను అందించాలని సూచించారు. అనంతరం ఎయిర్ టెల్ 5జి ఫైబర్ నెట్ భాగస్వాములతో కలిసి కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియల్, మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, కౌన్సిలర్లు గందె పద్మ సదానందం, మెరుగు కార్తీక్, కాంగ్రెస్ నాయకులు గందె సదానందం, పడిదల నవీన్, ఎయిరెటెల్ పార్టనర్లు గుగులోత్ వెంకటేష్, పార్ధసారధి, అనిల్, భాస్కర్, రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్వాక్రా భవనాల నిర్మాణ స్థల ఎంపికపై గ్రామంలో వివాదం

- ప్రభుత్వ భూమి ఉండ గాన చెరువు స్థలం ఎందుకు..?
- డ్వాక్రా భవనాల నిర్మాణం రాజకీయ రంగు దాల్చుతుందా..?



**లక్ష్మీదేవిపల్లి, మార్చి 14 ( ప్రజాజ్యోతి )** లక్ష్మీదేవిపల్లి మండలం, రేగళ్ల గ్రామానికి కేంద్ర ప్రభుత్వం మహిళా సంఘాల కోసం మంజూరు చేసిన రెండు డ్వాక్రా భవనాల నిర్మాణం ప్రస్తుతం స్థల ఎంపికపై వివాదానికి దారితీసింది. సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ భవనాలకు నిధులు ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ ద్వారా అందుతున్నట్లు సమాచారం. ఈ భవనాల నిర్మాణానికి ఎటువంటి రాజకీయ సంబంధం లేదని దీనిని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించవద్దని కొందరు గ్రామ పెద్దలు సూచిస్తున్నారు. ఈ భవనాల కోసం కీ.శే. సోమరాజు వెంకట రామారావు సుశీల బాయి గార్ల జ్ఞాపకార్థం వారి మనుమడు సోమరాజు అనిల్ బాబు స్థలం ఇచ్చినట్లు తెలిపారు. పట్టాదారు కీ.శే. సోమరాజు రామచంద్ర ప్రభు అని పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం డ్వాక్రా గ్రూపు వి.ఓ లక్ష్మీదేవి పల్లి మరియు పంచాయతీ రాజ్ శాఖ లక్ష్మీదేవిపల్లి మండల ఏ.ఈ అధికారులు రేగళ్ల చెరువు సమీపంలోని భూమిని నిర్మాణ స్థలంగా సూచిస్తున్నట్లు సమాచారం. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజల వాదన ప్రకారం చెరువు ప్రాంతంలో భవనం నిర్మిస్తే మత్స్యకారులు మరియు చెరువు కింద సుమారు 100 ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు. అలాగే ఆ ప్రాంతంలో నీటి ప్రవాహానికి కల్వర్ట్ ఉండటంతో నిర్మాణం వల్ల భవిష్యత్తులో వర్షాకాలంలో వరద సమస్యలు, భవనం దెబ్బతినే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక గ్రామంలో దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఖాళీగా ఉన్నప్పటికీ దానిని పక్కనపెట్టి చెరువు ప్రాంతాన్ని ఎంపిక చేయడం ఎందుకని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం వంటి ఇతర ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణం చేపట్టాలని సూచిస్తున్నారు. డ్వాక్రా మహిళా సంఘాల భవన నిర్మాణానికి ఎవరూ వ్యతిరేకం కాదని, అయితే చెరువు భూమిపై కాకుండా సరైన ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేయాలని మాత్రమే గ్రామస్తులు కోరుతున్నారు. ఈ అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. స్థలం వివాదంగా మారిన విషయం పై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుల ఆవేదన




**ఇల్లందు, మార్చి 14, ప్రజా జ్యోతి:** కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న జిల్లాలోని మైనారిటీ నాయకులకు ఈ బాధ్యతలు ఇవ్వకుండా మసీద్ పెద్దలకు అప్పజెప్ప వల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ ఇబ్రహీమ్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం కుటుంబాల కోసం రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ కుటుంబాలకు రంజాన్ తోఫాతో పాటు ఉపవాసాలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును జీఓ నంబర్ 26 ద్వారా ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జెండాలు మోసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన పార్టీ కోసం కష్టపడుతున్న జిల్లాలోని మైనారిటీ నాయకులకు ఈ రంజాన్ తోఫాను పేద మైనారిటీ కుటుంబాలకు అందించే అవకాశం ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. జిల్లాలోని 5 నియోజకవర్గాలలో 4వేల గిఫ్ట్ ప్యాకెట్లు మాత్రమే ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో 63వేల మంది ముస్లిం జనాభా ఉండగా కేవలం 4వేల రంజాన్ తోఫా ( గిఫ్ట్) ప్యాకెట్లు అందించటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్ర రంజాన్ మాసం లో ముస్లిం మైనారిటీ కుటుంబాలకు అందించే తోఫా (గిఫ్ట్) ఇఫ్తార్ విందులను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల తర్వాత మైనారిటీలను గుర్తుపెట్టుకుని ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు.

## ప్రపంచ కార్మిక వర్గానికి మార్గదర్శకుడు కారల్ మార్క్స

- ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 14 ,ప్రజా జ్యోతి:** ప్రపంచ కార్మిక వర్గానికి మార్గదర్శకుడు, మహాతత్వవేత్త కారల్ మార్క్స అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనంనేని సాంబశివరావు అన్నారు. మార్క్స 143వ జయంతిని శనివారం సుగుణ గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటనికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం అనంతరం ఆయన మాట్లాడుతూ మార్క్స ప్రతిపాదించిన సమానత్వభావాలు శ్రమ జీవుల హక్కుల కోసం చేసిన సిద్ధాంత పోరాటం ప్రపంచ వ్యాప్తంగా కార్మిక ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. సమాజంలో అసమానతలను తొలగించి నమాన హక్కులు సాధించాలన్న లక్ష్యంతో ఆయన చేసిన కృషి ఎప్పటికీ స్పూర్తి దాయకమని అన్నారు, ప్రస్తుత కాలంలో కూడా మార్క్స ఆలోచనలు సమాజ మార్పుకు మార్గం చూపుతున్నాయని, కార్మికులు, రైతులు ఐఖ్యంగా పోరాడితేనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు ,ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, బెజవాడ వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాలవిశ్వనాధం, కల్లూరివెంకటేశ్వరరావుతో పాటు, వాసిరెడ్డి మురళీ, సరెడ్డి పుల్లారెడ్డి, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జనమే సేనగా మారి అండగా నిలిచారు

- తెలంగాణ రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతాం
- ముయ్యబోయిన ఉమాదేవి జనసేన నియోజకవర్గం నాయకురాలు
- ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**అశ్వారావుపేట, మార్చి 14, ప్రజాజ్యోతి :** జనమే సేనగా మారి జనసేనని పవన్ కళ్యాణ్ కు అండగా నిలిచారని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకురాలు ముయ్యబోయిన ఉమాదేవి అన్నారు. శనివారం జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలోని అమ్మ సేవాసదనం లో పార్టీ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్స్, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ బలమైన రాజకీయశక్తిగా ఎదుగుతుందన్నారు . జనసేనని పవన్ కళ్యాణ్ ఆశయాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వేముల కార్తీక్ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని, సభ్యత్వ నమోదులో తమ వంతు సహకారాన్ని అందించి అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా ముందడుగు వేస్తామన్నారు ఈ కార్యక్రమంలో గుమ్మల పోసి, బమ్మిడి ప్రసాద్, భాను, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి యూనిఫాం సిబ్బందికి శిక్షణ అవసరం

- **సెక్యూరిటీ సిబ్బందికి ముగిసిన ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతులు**





**కొత్తగూడెం సింగరేణి, మార్చి 14 – ప్రజాజ్యోతి:**
ప్రతి యూనిఫాం సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్ పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని ఏరియా సెక్యూరిటీ అధికారి/ ట్రైనింగ్ అధికారి యం. డి జాకీర్ హుస్సేన్ అన్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలనుండి వచ్చిన 34 మంది సెక్యూరిటీ సిబ్బందికి వారం రోజుల పాటు జరిగిన 38వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ & ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతులు శనివారంతో ముగిసాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... ప్రతి యూనిఫాం సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్ పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని, అందులో భాగంగా యస్&పి.సి. విభాగములో ప్రతి సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్ పై శిక్షణనివ్వడం జరుగుతుందని, తద్వారా సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగు పడిందని, వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్ లోని అన్ని అంశాలపై బోధించడం జరిగినదని, అందుకోసం మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, భద్రాద్రి కొత్తగూడెం ఫైర్ స్టేషన్ నుండి ఫ్యాకల్టీని తీసుకోవడం జరిగినదని, మనకు ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన ఉంటే మన తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళే లోపు వారి ప్రాణాలను కాపాడవచ్చునని, మనం పని చేయు ప్రదేశాలలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు వాటిని నివారించి సింగరేణి ఆస్తులను పరిరక్షించగలమని, మెరుగైన వృత్తి నైపుణ్యంతో, క్రమశిక్షణతో, నీతినిజాయితీతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికై సెక్యూరిటీ సిబ్బంది అందరూ పాటుపడాలని తెలిపారు. శ్రీ జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహకులకు సెక్యూరిటీ సిబ్బందిచే నిత్యావసర సరుకులను వితరణ గావించారు. కోర్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరచిన యం.పెద్దులు, డి.అజయ్ కు బహుమతి ప్రదానం చేసారు. ట్రైనింగ్ ఇన్ స్పెక్టర్ డి. నారాయణ రెడ్డి వందనసమర్పణ చేసారు.

## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

- **కొత్వాల శ్రీనివాస్ రావు**



**పాల్వంచ, మార్చి 14, ప్రజాజ్యోతి:**రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 9వ రోజు కార్యక్రమాలు నిర్వహించారు. 36వ డివిజన్ ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మీ మనోహర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన పారిశుధ్య అవగాహన ర్యాలీని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్యం, అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని వాటర్ ట్యాంక్ శుభ్రపరిచే పనులు చేపట్టారు. ట్యాంక్ కింద పెరిగిన చెట్లను తొలగించి, ట్యాంక్‌లోని నీటిని పూర్తిగా తీసివేసి ట్యాంక్‌ను కడిగి శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండం వెంకన్న, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పైడిపల్లి మహేష్, డివిజన్ నాయకులు పట్టా వీరకుమార్, చంద్ర వీరయ్య, బండి రఘు, అమీరుద్దీన్, చంద్ర బుద్ధబాబు, పరుచూరి వెంకటేశ్వర రావు, మెట్టు వీరారెడ్డి, పరుచూరి అశోక్, సందు ప్రభాకర్, బండి నాగరాజు, కార్పొరేషన్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దేవుడి సేవలో మానవత్వం

- **వృద్ధ భక్తురాలికి అండగా నిలిచిన రామాలయ టెంపుల్ పోలీస్**





**భద్రాచలం, మార్చి 14,ప్రజాజ్యోతి :**భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి దర్శనార్థం వచ్చిన ఓ వృద్ధ భక్తురాలికి టెంపుల్ పోలీస్ కానిస్టేబుల్ సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయన చూపిన సేవాభావం అక్కడున్న భక్తుల ప్రశంసలు అందుకుంది.వీల్‌చైర్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చిన వృద్ధురాలు దర్శనం అనంతరం బయటకు వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో పాటు మెట్లు ఉండడం వల్ల కుటుంబ సభ్యులు ఆమెను వీల్‌చైర్‌తో బయటకు తీసుకువెళ్లడంలో ఇబ్బంది పడ్డారు.అక్కడే విధులు నిర్వహిస్తున్న టెంపుల్ పోలీస్ కానిస్టేబుల్ పరిస్థితిని గమనించి వెంటనే స్పందించారు. ఆయన స్వయంగా ముందుకు వచ్చి వృద్ధ భక్తురాలిని జాగ్రత్తగా వీల్‌చైర్‌తో బయటకు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు సహాయం చేశారు. ఈ సందర్భంగా భక్తురాలు మరియు ఆమె కుటుంబ సభ్యులు పోలీసుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ దృశ్యాన్ని గమనించిన ఇతర భక్తులు పోలీసు కానిస్టేబుల్ సేవాభావాన్ని అభినందించారు. “దేవుడు ఎక్కడో కాదు... ఇలాంటి సేవాభావం చూపే మనుషుల్లోనే ఉన్నాడు” అంటూ ఆయనను ప్రశంసించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం సాఫీగా జరిగేలా పోలీసులు, ఆలయ అధికారులు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. భక్తుల భద్రతతో పాటు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో టెంపుల్ పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని వారు తెలిపారు.

## స్నేహపూర్వకంగా క్రీడలు ఆడాలి







**ఇల్లందు, మార్చి 14, ప్రజాజ్యోతి:** స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలను ఆడాలని ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు కోరారు. శుక్రవారం స్థానిక 24 ఏరియాలోని వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ క్రీడా మైదానంలో ఇల్లందు ప్రెస్, కొత్తగూడెం ప్రెస్ మధ్య జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ను డీఎస్పీ వీక్షించారు. మొదట టాస్ గెలిచిన కొత్తగూడెం ప్రెస్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఇల్లందు ప్రెస్ జట్టు 15 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమని, గెలిచినవారు గర్వపడవద్దని, ఓడిన వారు నిరుత్సాహ పడవద్దు అని సూచించారు. ఓటమి చెందిన వారు ఓటమి గల కారణాలను తెలుసుకొని మరల అలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం విజయం సాధించిన కొత్తగూడెం ప్రెస్, రన్నర్ ఇల్లందు ప్రెస్ జట్లకు డిఎస్పి బహుమతులను అందజేశారు. అదేవిధంగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ తోటకూరి శ్రావణ్, బెస్ట్ బౌలర్ తోటకూరి జయంత్, బెస్ట్ బ్యాట్స్ మెన్ మనోహర్ లకు డీఎస్పీ మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ప్రెస్, కొత్తగూడెం ప్రెస్ సభ్యులు, రిపోర్టర్లు పాల్గొన్నారు.

## పమిడి పడగా ఇలవేల్పు జాతర పోస్టర్లు ఆవిష్కరణ



**గుండాల. ప్రజా జ్యోతి. మార్చ్. 14.** ఏప్రిల్ 22 నుండి 25 వరకు జరిగే పమిడి పడగా ఇలవేల్పు జాతరను జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికలను ఆవిష్కరించారు శనివారం గుండాల మండల కేంద్రంలోని సంత ప్రాంగణంలో పమిడి పడగా సడలమ్మ పెద్ద వేల్పు రాయి బండాన్ని ఇలవేల్పు జాతరను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్ను ఆవిష్కరించారు రాయి బండాన్ని రాజులు వంశీయులు పాల్గొని మాట్లాడారు రాయి బండాన్ని వంశీయులైన దానసరి వాగబోయిన భూపతి మంకిడి ఊకే ఏదల్లపల్లి రేతా పొంబోయిన జబ్బా కోలా అయిలబోయిన దుగ్గారపు బత్తుల ఇంటి పేర్ల గలవారు ఈ జాతరను నడుపుకుంటారని మహబూబాబాద్ జిల్లా పాకాల కొత్తగూడం మండలం వెలుబెల్లి గ్రామంలో జాతర జరుగుతుందని వారు తెలిపారు జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు ఈ జాతరకు వడ్డెలుగా దారం వంశీయులు , ఆర్తి బిడ్డలుగా అలం వంశీయులుగా వ్యవహరిస్తారని వారు పేర్కొన్నారు తలపతులు ధనసరి సారయ్య, ఓకే సమ్మయ్య , పొంబోయిన ముత్తయ్య, వాగబోయిన బాలయ్య, రవి, దుగ్గి రాంబాబు మంకిడి నరసయ్య, ఓకే సత్యం జబ్బా రామ్మూర్తి సమ్మయ్య సుదర్శన్ దుగ్గి రామయ్య వాగబోయిన కృష్ణమూర్తి ఊకే వెంకటేశ్వర్లు సాంబయ్య దారం సమ్మయ్యలు పాల్గొన్నారు.